మన్యం జిల్లాకు రెగ్యులర్ డీఈవోను నియమించాలి

ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్‌కుమార్ డిమాండ్

విశాలాంధ్ర-బెలగాం : పార్వతీపురం మన్యం జిల్లాకు రెగ్యులర్ డీఈవోను నియమించాలని, శంకర్రావు డెప్యుటేషన్ రద్దు చేసి విద్యా శాఖపై వస్తున్న అనేక ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. బాధ్యత లేని విద్యా శాఖ, జిల్లా మంత్రి, జిల్లా ఇంచార్జి మంత్రి, జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు బాధ్యత లేకుండా ఉండడం వల్లే ఈ పరిస్థితి అని రంజిత్ కుమార్ అన్నారు. కలిసి వచ్చే అన్ని విద్యార్థి, గిరిజన, ప్రజా సంఘాలను కలుపుకొని అక్టోబర్ 6వ తేదీన పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తామని రంజిత్ కుమార్ తెలిపారు. గత నాలుగు రోజుల్లో ఇద్దరు విద్యార్థినుల మృతి పై సమగ్ర విచారణ జరిపించాలని రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు.

అమ్మవారి సారె ఊరేగింపు

విశాలాంధ్ర-సీలేరు : జీకే వీధి మండలం దారకొండ శ్రీరామాలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన దసరా ఉత్సవాలలో భాగంగా అమ్మవారి శరన్నవరాత్రుల కార్యక్రమం భక్తులు భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నారు.అమ్మవారిని భక్తులు రోజుకో అవతారంలో దర్శించుకొని తరిస్తున్నారు.ఈరోజు భక్తులందరూ అమ్మవారి సారె దారకొండ పుర వీధులలో అమ్మవారి నామస్మరణ చెబుతూ ఊరేగించారు.అమ్మవారి నామస్మరణతో దారకొండ హెూరెత్తిపోయింది. ఈ ఊరేగింపు కార్యక్రమంలో స్థానిక భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బుడితి అప్పలనాయుడు ఆధ్వర్యంలో ప్రముఖులకు పరామర్శ

విశాలాంధ్ర-పాలకొండ : ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుడితి అప్పలనాయుడు ఆధ్వర్యంలో శనివారం ప్రముఖులకు పరామర్శ చేశారు ఇటీవల బూర్జ మండలం రాజుపేట గ్రామానికి చెందిన మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్ మాతృమూర్తి ఇటీవల స్వర్గస్తులైనారు. అలాగే పార్వతీపురం మన్యం జిల్లా ప్రముఖ వైద్యులు ప్రభుత్వ ఆసుపత్రుల పర్యవేక్షణ అధికారి గొర్లె నాగభూషణరావు మాతృమూర్తి స్వర్గస్తులు అయ్యారు విషయం తెలుసుకున్న అప్పలనాయుడు బృందం పరామర్శ చేస్తూ వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని సంతాపాన్ని వ్యక్తం చేశారు,పరామర్శించిన వారిలో వండాన కూర్మారావు బీసీ నాయుడు,జద్దు బాలరాజు,ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు ఏబీఎస్ సత్యం నాయుడు తదితరులు ఉన్నారు.

అంబులెన్స్ సర్వీస్ సేవలపై స్టేట్ ప్రోగ్రాం మేనేజర్ ఆరా

విశాలాంధ్ర-బెలగాం : పార్వతీపురం మన్యం జిల్లాలో ఫీడర్ అంబులెన్స్ సర్వీస్ సేవలపై, సిబ్బంది అందిస్తున్న సేవలపై స్టేట్ ప్రోగ్రాం మేనేజర్ ఫణీంద్ర ఆరా తీసి అంబులెన్స్‌లో అన్ని రికార్డులను తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 24 ఫీడర్ అంబులెన్స్ ఉన్నాయని ఈ 24 అంబులెన్సులు రోజుకి 90 కేసులు వరకు సర్వీసులు అందిస్తున్నాయని ఇంకా ఈ సర్వీసులు పెంచడానికి ప్రయత్నం జరుగుతుందని అన్నారు. ముఖ్యంగా రోడ్డు సదుపాయం లేని ప్రదేశాలు సాధారణ అంబులెన్సులు వెళ్లటానికి కష్టంగా ఉండే ఇరుకైన మార్గంలో ఈ ఫ్రీడమ్ అంబులెన్స్ లను ఉపయోగిస్తామని ఇది కూడా వైద్యసేవలో భాగమన్నారు. మారుమూల గిరిజన ప్రాంతాల్లో తక్షణమే వైద్య సేవలు అందుబాటులో లేని చోట వీటిని ఉపయోగిస్తామన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు లేదా సమీపంలోని 108 అంబులెన్స్ దగ్గరికి తీసుకెళ్తాయని ఈ సేవలను ఇంకా పెంచుతామని మా ఈఎంటిలు 24 గంటలు అందుబాటులో ఉంటారని ప్రజలందరూ ఈ సేవలను వినియోగించు కోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ చంద్రశేఖర్, సిబ్బంది ఉన్నారు.

ఓపెన్ స్కూల్ ప్రవేశాలకు అక్టోబర్ 31 వరకు గడువు పొడిగింపు

ఎంఈఓ-1 సామల సింహాచలం

విశాలాంధ్ర-బలిజిపేట : ఓపెన్ స్కూల్ ద్వారా 2025 బి 26 విద్యా సంవత్సరంలో పదవ తరగతి, ఇంటర్మీడియట్ కోర్సులలో జాయిన్ అయ్యేందుకు అక్టోబర్ 31వ తేదీ వరకు గడువు పొడిగిస్తూ ఓపెన్ స్కూల్ సొసైటీ రాష్ట్ర డైరెక్టర్ ఆర్ నరసింహారావు ఉత్తర్వులు జారీచేసినట్లు బలిజిపేట ఎంఈఓ 1 సామల సింహాచలం తెలిపారు. శనివారం ఆయన ఎంపీడీవో కార్యాలయం వద్ద విలేఖరులతో మాట్లాడుతూ ఓపెన్ స్కూల్ సొసైటీ ద్వారా పదో తరగతి మరియు ఇంటర్ మీడియట్ కోర్సులను ఇంటి దగ్గర ఉంటూనే దూర విద్యా విధానంలో పూర్తిచేసే అవకాశం ఉందన్నారు. పదో తరగతి, ఇంటర్మీడియట్ చదువు మధ్యలో ఆపేసిన విద్యార్థులకు,ఇంకా చదువుకోవాలని ఆసక్తి ఉన్న వారికి దూర విద్యా విధానంలో చదువు పూర్తి చేసుకునేందుకు మంచి అవకాశం ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. 200 రూపాయలు అపరాధ రుసుము చెల్లించి జాయిన్ అయ్యేందుకు అక్టోబర్ 31వ తేదీ వరకు గడువును పొడిగించినట్లు తెలిపారు. పూర్తి వివరాలకు తమ కార్యాలయంలో సంప్రదించవచ్చని ఎంఈవో సామల తెలిపారు.

సమాచార హక్కు చట్టం 2005పై అవగాహన

విశాలాంధ్ర-పాచిపెంట : వ్యవసాయ కమిషనర్ గుంటూరు వారి ఆదేశం మేరకు ప్రజలలో సమాచార హక్కు చట్టం 2005 పై రైతులకు మరియు వ్యవసాయ శాఖ సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించడం అయినది పాంచాలి గ్రామ రైతు సేవా కేంద్రంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి కే తిరుపతిరావు మాట్లాడుతూ పాలనలో జవాబుతనందారి తనం మరియు పారదర్శకత ఉండడం కోసమే సమాచార హక్కు చట్టం 2005 తయారు చేయబడిందని ప్రజా ప్రయోజనాలు ఉన్న ఎలాంటి సమాచారాన్ని అయినా సరే ఈ చట్టం ద్వారా పొందవచ్చని తెలిపారు ప్రతి ఆఫీసులో పౌర సమాచార మరియు సహాయ పౌర సమాచార అధికారి కి దరఖాస్తు దారు కోరిన 30 రోజులలో సమాచారాన్ని అందించాలని ఇచ్చిన సమాచారం పై దరఖాస్తుదారు సంతృప్తి చెందని ఎడల మరల స్పష్టతతో కూడిన సమాచారాన్ని అందించాలని 30 రోజుల గడువు దాటితే దరఖాస్తుదారులకు పూర్తి ఉచితంగానే సమాచారం ఇవ్వాల్సి ఉంటుందని పారదర్శకత కోసం ఎవరో కోరకుండానే సెక్షన్ (2) సబ్ సెక్షన్(1) క్లాస్ బి ప్రకారం సమాచారాన్ని ప్రజలకు తెలియజేయాల్సి ఉంటుందని తెలిపారు దరఖాస్తు గారు అడిగిన సమాచారాన్ని దేనికైనా వాడుక భాషలోనే ఇవ్వాలని వీలైనంతవరకూ సమాచారం సరళంగా అర్థవంతమైనదిగా ఉండాలని తెలిపారు పౌర సమాచార అధికారి సమాచారం ఇవ్వని ఎడల మొదటి అప్పిలేట్ అధికారికి దరఖాస్తు చేసుకుని సమాచారాన్ని పొందవచ్చని దరఖాస్తుదారు సమాచార అధికారికి సంబంధించినది కాకుండా ఇతర డిపార్ట్మెంట్లకు సంబంధించిన సమాచారాన్ని కోరినట్లయితే పౌర సమాచార అధికారి సంబంధిత శాఖకు పంపించి అదే విషయాన్ని దరఖాస్తు దారుకు తెలియజేయాల్సి ఉంటుందని తెలిపారు ఈ కార్యక్రమంలో రైతులు వైఎస్ఆర్సిక్ సిబ్బంది పాల్గొన్నారు.

తృటిలో తప్పిన పెను ప్రమాదం

విశాలాంధ్ర-సీతంపేట : ఆర్టీసీ బస్సు శనివారం పాలకొండ నుండి అంటికొండ వెళ్తుండగా గుమ్మడ సమీపంలో చెట్టు మొదలు తగిలి బస్సు వెనక్కి వరగడం జరిగిందని అదే సమయంలో డ్రైవర్ అప్రమత్తమై బస్సును కంట్రోల్ చేయడంతో ప్రమాదం తట్టింది అని కొండ కిందకి బస్సు జారినట్లు అయితే పెను ప్రమాదం జరిగేదని ఈ ప్రమాదం తృటిలో తప్పిందని, ఆ సమయంలో ప్రయాణికులు ఎవరికీ ఏమీ కాలేదని సమీప గ్రామస్తులు తెలిపారు. ఈ సంఘటనపై పాలకొండ ఆర్టిసి డిపో మేనేజర్ కు విశాలాంధ్ర ఫోన్లో సంప్రదించగా ఎవరికి ఏమి ప్రమాదం కాలేదు బస్సు పైపు చెట్టు మొదలుకు తగిలి విరిగిపోవడం జరిగిందని తెలిపారు.

కలెక్టర్‌ను కలిసిన 104 జిల్లా మేనేజర్ కృష్ణ

విశాలాంధ్ర-బెలగాం : 104 జిల్లా మేనేజర్ ఎస్. కృష్ణ శుక్రవారం సాయంత్రం పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ డా. ఎస్. ప్రభాకర్ రెడ్డిని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలసి పూలబొకే అందచేశారు. ఈ సందర్భంగా జిల్లాలో 104 వాహనాలు ద్వారా గ్రామాలల్లో అందిస్తున్న వైద్యసేవలు పనితీరు ఎలా ఉంది. గ్రామాలల్లో, మరీ ముఖ్యంగా హిల్ ఏరియాలలో గిరిజనులకు అందుతున్న వైద్య సేవలు కోసం కూడా ఆరా తీశారు. జిల్లాలో 104 వాహనాలు ద్వారా అన్నీ గ్రామాలలో అందిస్తున్న వైద్య సేవలు, మందుల లభ్యత, మరియు వైద్య పరీక్షలు మొదలైన వాటి వివరాలు ఆయన అడిగి తెలుసుకుని, సంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లాలో ఉన్న 104 వాహనాలను కూడా ఆకస్మికంగా తనిఖీ చేసి నాణ్యమైన సేవలు ప్రజలకు అందేలాగా చూడాలనీ, జిల్లాలో అన్నీ గ్రామాల ప్రజలకు ఇంకా మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ ఆదేశించారు.

దుర్గమ్మ సేవలో శ్రీకాకుళం జిల్లా న్యాయమూర్తి

విశాలాంధ్ర-పాలకొండ : పాలకొండ వాసుల ఇలవేల్పు శ్రీ కోటదుర్గమ్మ తల్లి వారి సేవలో శ్రీకాకుళం జిల్లా న్యాయమూర్తి వివేక్ ఆనంద్ శ్రీనివాస్ శనివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు ఈ సందర్భంగా ఆలయ మర్యాదలతో న్యాయమూర్తికి స్వాగతం పలికారు ఆలయ పరిసరాలను పరిశీలన చేశారు, న్యాయమూర్తికి ఆలయ కార్య నిర్వహణ అధికారి సూర్యనారాయణ ప్రధాన అర్చకులు దార్లపూడి లక్ష్మీప్రసాద్ శర్మ, శర్మ బాబు లు అమ్మవారి చిత్రపటాన్ని వేద ఆశీర్వచనాలు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరము పాలకొండ సబ్ జైలనుసందర్శించి ఖైదీలకు అందుతున్న సేవలను ఆరా తీశారు జైలులో ఖైదీలకు వేడి ఆహార పదార్థాలను అందజేయాలని సూచించారు పరిశుభ్రంగా పరిసరాలను ఉంచాలని అన్నారు తరచూ ఖైదీలకు ఆరోగ్య పరీక్షలను నిర్వహించాలని ఆదేశించారు ఆయనతోపాటు జిల్లా న్యాయ సేవ అధికారి కే హరిబాబు సబ్ జైలు పర్యవేక్షకులు జోకులు పోలీస్ సిబ్బంది సబ్ జైలు సిబ్బంది తదితరులు ఉన్నారు.

కౌన్సిల్ సమావేశం అంటే... మెరుగైన పాలన అందించేందుకు వీలు కల్పించేది

- పాలకవర్గ సభ్యులు ఉద్ఘాటన
- కొన్ని అంశాలపై కౌన్సిలర్ల మండిపాటు

విశాలాంధ్ర-పాలకొండ : కౌన్సిల్ సమావేశం అంటే ఏమనుకున్నారు పట్టణ సమస్యలు ప్రజల సమస్యలు గుర్తించి వాటిని పాలకొండ నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశంలో చర్చించి మెరుగైన పాలన అందించే విధంగా చర్యలు తీసుకోవడమే కౌన్సిల్ సమావేశం ముఖ్య ఉద్దేశమని పాలకవర్గ సభ్యులు పేర్కొన్నారు. శనివారం పాలకొండ నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం ఆకుల మల్లేశ్వరి ఆధ్వర్యంలో నిర్వహించారు. కౌన్సిల్ సమావేశంలో ఇచ్చినటువంటి ఎజెండాలో ఉన్న కొన్నిఅంశాలను ముందుగా కౌన్సిలర్స్‌కి తెలియపరచకుండా పొందుపరచడంపై కౌన్సిలర్లు మండిపడ్డారు. సుమారు రెండు గంటల కాలం సమావేశాన్ని బొయ్ కట్ చేశారు అనంతరము కమిషనర్ను వివిధ శాఖలలో పనిచేస్తున్న ఉద్యోగులను సమావేశపరిచి సమన్వయంతో పనిచేయాలని అప్పుడే ప్రజలకు మెరుగైన సేవలు అందించడం జరుగుతుందని ఏవైనా మీ ఉద్యోగుల సమస్యలుంటే మా దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఉద్యోగులు, పాలకవర్గం సమన్వయంతో పనిచేస్తేనే ప్రజలకు సేవలు అందించడం జరుగుతుందని తెలిపారు ఉద్యోగులు,కమిషనర్ అహాన్ని విడిచిపెట్టి ఒకరికొకరు సమన్వయంతో పనిచేయాలని అప్పుడే సత్ ఫలితాలు వస్తాయని అన్నారు అనంతరము కౌన్సిల్ సమావేశం యథావిధిగా కొనసాగించారు ఎజెండాలో పొందుపరిచినటువంటి కొన్ని అంశాలను తీర్మానం చేస్తూ అక్కడికక్కడే మినిట్స్ బుక్కులో వ్రాయించారు ఈ సమావేశంలో కౌన్సిలర్స్ వెలమల మన్మధరావు దుప్పాడ పాపినాయుడు,భాసూరు కాంతారావు కౌన్సిలర్ ప్రతినిధులు కడగల వెంకటరమణ కొంచాడ అరుణ్ కుమార్ పల్ల భానుబాబు తూముల లక్ష్మణరావు కొరికాన గంగునాయుడు కడ్రోతు లక్ష్మి ఆకుల కుమారు కొండదాడి విజయకుమార్ బుక్కురు దుర్గారావు,అన్ని శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

విశాలాంధ్ర-డుంబ్రిగుడ : మండలంలోని కొర్రాయి పంచాయితీ పెద్ద అంజూడ, గత్తర జిల్లేడ గ్రామంలో 15వ ఆర్థిక సంఘం నిధులతో సిసి రోడ్డు నిర్మాణానికి సర్పంచ్ కొమ్ములు,వైస్ ఎంపీపీ లలిత కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిసి రోడ్డు నిర్మాణాలతో గ్రామాలు మరింత అభివృద్ధి చెందుతాయని వారు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ జగన్నాథం, వార్డు సభ్యులు బుద్దు, పీసా కమిటీ సభ్యులు, దామోదర్, ఆనంద్ రావు, గురు, కూటమి నాయకులు లక్ష్మణరావు, నాగరాజు, వైసిపి నాయకులు నరేష్, గ్రామాల పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు తవ్వారు... పూడ్చడం మరిచారు..!

ఆర్ డబ్ల్యు ఎస్ అధికార్ల నిర్లక్ష్యానికి గతంలో ఒకరు మృతి

విశాలాంధ్ర-పాడేరు : చింతలవీధీ జంక్షన్ నుండి పెదబయలు వైపు వెళ్ళే ప్రధాన రహదారి బురాల్ వాక ఘాట్ వద్ద దాదాపు 8నెలల పై చిలుకు జి ముంచంగిపుట్టు నుంచి పాడేరు పట్టణానికి పైపు లైన్ ద్వారా ఆర్ డబ్ల్యు ఎస్ అధికార్లు పంచాయతీ కొళాయి నీరు అందించడానికి భూమి క్రింద పైపు లైన్ వేశారు . కాగా బురాల్ వాక ఘాట్ వద్ద పైపు లైన్ వగిలిపోయింది దాన్ని మరమ్మత్తు చేసేందుకు గాను ఆర్ డబ్ల్యు ఎస్ సిబ్బంది మెయిన్ రోడ్ తవ్వేశారు. మరమ్మత్తు చేసినా అనంతరం మెయిన్ రోడ్‌తో పాటు పక్కన పెద్ద గొయ్యి పూర్తిగా పూడ్చడం మరిచి పోగ ఇదివరకు ఒక వృద్ధుడు అదే గోయి లో ప్రమాదవశాత్ పడి మృత్యువాత పడ్డారు. దాంతో తారు రోడ్డు వేసినా కాంట్రాక్ట్ కి తడి మోపుడై నష్ట పరిహారం చెల్లించే పరిస్తితి ఏర్పడింది. ఆర్ డబ్ల్యు ఎస్ అధికార్ల నిర్లక్ష్యానికి కాంట్రాక్ట్ బలై పోయారు. ఈ సంఘటన తర్వాత కూడా కనీసం ఆర్ డబ్ల్యు ఎస్ అధికార్లు ఆర్ అండ్ బి అధికార్లకు కనీసం సంప్రదింపులు చేయలేదు అనేది ప్రధాన ఆరోపణ వెల్లువెత్తింది. రోడ్ సగం పోవడంతో అమలుపు వద్ద రెండు వైపుల వాహన దారులు సైడ్ ఇచ్చు కోవడానికి ఇబ్బంది పడే పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా అటు ఆర్ అండ్ బి అధికార్లు, ఇటు ఆర్ డబ్ల్యు ఎస్ అధికార్లు స్పందించి సత్వర చర్యలు తీసుకోకపోతే రాబోయే చలికాలం ప్రమాదాలు జరగక తప్పదు. రెండు శాఖల అధికారులు స్పందిస్తారో లేదో వేచిఉండాల్సి ఉంది.

కిండంగి రెవిన్యూ పరిధిలో బినామీ పేర్లతో అక్రమ నిర్మాణాలు జోరు

- ఆదివాసి గిరిజన హక్కులు చట్టాలకు పొంచి ఉన్న పెను ప్రమాదం
- పంచాయతీ రెవెన్యూ అధికారుల అనుమతులు లేకుండా పంట పొలాల్లో నిర్మాణాలు
- కళ్ళు మూసుకున్న పంచాయతీ రెవెన్యూ యంత్రం

విశాలాంధ్ర-పాడేరు : అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు మండలం కిండంగి పంచాయితీ రెవెన్యూ పరిధిలో నేషనల్ ఎన్ హెచ్ 516 ఈ రోడ్డు ఏర్పడడంతో ఆ ప్రాంతంలో ఉన్న భూముల రేట్లు హఠాత్తుగా ఆకాశానికి వెళ్లిపోయాయి. ఈ క్రమంలో కిండంగి రెవెన్యూ పరిధిలో భూములు గిరిజనేతరుల కళ్ళలో పడ్డాయి. గిరిజనేతరులు పంచాయితీ రెవెన్యూ అధికారులు కుమ్మక్కై బినామీల పేర్లతో పంట పొలాలను కొనుగోలు చేసి యథేచ్ఛగా పంచాయితీ రెవెన్యూ అనుమతులు లేకుండా విచ్చలవిడిగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. ప్రశ్నించే నాథుడే కాసులకు కక్కుర్తి పడితే కంచె చేను మేసింది అన చందంగా కిండంగి పంచాయితీ రెవెన్యూ అధికారుల పనితీరు కనిపిస్తుందని పలువురు అంటున్నారు.ఆదివాసి గిరిజన హక్కులు చట్టాలు కాపాడాల్సిన బాధ్యత గిరిజన ప్రజానీకానికి గిరిజన మేధావులకు ఉన్నప్పటికీ గిరిజనేతరులు ఇచ్చే కాసులకు కక్కుర్తి పడి గిరిజనులే బినామీ అవుతారమెత్తి గిరిజన చట్టాలు హక్కులను కాలరాస్తున్నారు. గిరిజన ప్రాంతంలో పీసా చట్టం ఉన్నప్పటికీ దాన్ని సక్రమంగా నడిపించలేని దుస్థితికి నేడు దిగజారింది అనడంలో ఎటువంటి సందేహం లేదు. గిరిజన ప్రాంత హక్కులు చట్టాలు కాపాడాల్సిన వాళ్లే హక్కుల చట్టాలకు తూట్లు పొడుస్తుంటే ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాని పరిస్థితి. ఇప్పటికైనా బినామీలుగా వ్యవహరించడం మని గిరిజనుల హక్కులు చట్టాలు కాపాడాలని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆ దిశగా గిరిజనేతరులకు బినామీలుగా గిరిజనులు అడుగులు వేస్తారు లేదో వేచి చూద్దాం.

పి-4తో పేద కుటుంబాలను త్వరితగతిన గుర్తించాలి

పాడేరు అబ్జర్వేటర్ శ్రీనివాస్ అదేశాలు

విశాలాంధ్ర-కొయ్యూరు : ప్రభుత్వం అమలు చేస్తున్న పేద కుటుంబాలను(బంగారు) గుర్తించి వారి ఆర్థికాభివృద్ధికి త్వరితగతిన కృషి చేయాలని ప్రోగ్రాం అబ్జర్వేటర్ శ్రీనివాస్, ఎంపీడీవో బాల మురళీకృష్ణ లు తెలిపారు. కొయ్యూరు మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీపీ బడుగు రమేష్ బాబు అధ్యక్షతన పాడేరు ప్రోగ్రాం అధికారి శ్రీనివాస్ ,ఎంపీడీవో బాల మురళీకృష్ణ లు ప్రభుత్వం అమలు చేసే పి -4 కార్యక్రమం పై సమావేశం నిర్వహించారు. సచివాలయం సెక్రటరీలు, డిజిటల్ అసిస్టెంట్స్, ఇతర, రెవెన్యూ సిబ్బంది ఎంపీటీసీ, సర్పంచ్ లతో పాటు పలువరు ప్రజాప్రతినిధులకు పి-4 కార్యక్రమంపై తెలియజేసారు. అనంతరం సచివాలయం కార్యదర్శులకు, పి.4, ప్రోగ్రాంపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రోగ్రాం అధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ సచివాలయం సిబ్బంది గ్రామాల్లో ఆర్థికంగా వెనుక బడిన కుటుంబాలను గుర్తించాలన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు త్వరిగతిన ఈ సర్వే పూర్తిచేసి తగిన వివరాల నివేదికను అందించాలని కార్యదర్శులకు, రెవెన్యూ అధికార్లుకు ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ బిడిజానా అప్పారావు, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు రెగటి మునిలినాయుడు, పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు కార్యదర్శులు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు సన్మానం : ఈ సందర్భంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పలువురు పారిశుధ్య కార్మికులను ఎంపీపీ బడుగు రమేష్ బాబు, ఎంపీటీసీ అప్పారావు, ఎంపీడీవో బాల మురళీకృష్ణ, అబ్జర్వ్ శ్రీనివాస్, పలువురు ఎంపీటీసీ లు, సర్పంచ్ లు, కార్యదర్శులు వీరిని సన్మానం చేశారు. గ్రామ పంచాయితీలు పారిశుధ్య పనులు మెరుగు పరచడానికి ఈ కార్మికులే ప్రధాన సేవకులు అని నేతలు, అధికార్లు కొనియాడారు.

బలపం కోరుకొండ రహదారికి మోక్షం కల్పించండి

- స్పందించకుంటే ఆ ప్రాంత ప్రజలతో ధర్నాకు దిగవలసి వస్తుంది
- ఎంపీపీ అనూష దేవి

విశాలాంధ్ర-చింతపల్లి : అధ్వాన్నంగా తయారైన రహదారులను పునర్నిర్మించకపోతే ప్రజలు రహదారులను దిగ్బంధనం చేసి ధర్నాలు నిర్వహించవలసి ఉంటుందని ఎంపీపీ కోరాబు అనూష దేవి అన్నారు. మండల సర్వసభ్య సమావేశంలో అధికారులు, ప్రజాప్రతినిధుల సాక్షిగా బలపం పంచాయితీ సర్పంచ్ లేవనెత్తిన లోతుగెడ్డ వంతెన నుంచి బలపం కోరుకొండ రహదారి వలన ఆ ప్రాంత ప్రజలు పడుతున్న ఇబ్బందులపై అటు పాలకులు, ఇటు అధికారులు ప్రత్యేక దృష్టి సారించి రహదారి కి మోక్షం కలిగించాలన్న దానిపై స్పందించిన ఆమె మాట్లాడుతూ అసలే అంతంత మాత్రంగా ఉండి గుంతల మయమైన లోతుగెడ్డ- బలపం కోరుకొండ ప్రధాన రహదారి ఈ మధ్యకాలంలో కురిసిన అకాల వర్షాల వలన అధ్వాన్నంగా తయారైన విషయం పాఠకులకు తెలిసిందే అన్నారు. ఈ విషయంలో పాడేరు మాజీ శాసనసభ్యురాలు, వైకాపా ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షురాలు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, జడ్పిటిసి సభ్యుడు పోతురాజు బాలయ్యలతో కలిసి సందర్శించడం జరిగిందన్నారు. ఈ రహదారి గుండా వాహనాల రాకపోకలకే గాక, కనీసం కాలినడకన వెళ్లేందుకు కూడా వీలు లేకుండా గుంతల మయంగాను, వర్షాల సమయంలో పంట పొలాన్ని తలపించే విధంగా ప్రమాద భరితంగా తయారైంది అన్నారు. ఈ రహదారిని పూర్తిస్థాయిలో పునర్ నిర్మించాలని ఈ సందర్భంగా ఆమె డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆ ప్రాంత ప్రజలతో కలిసి రహదారి దిగ్బంధనం చేయడంతో పాటు ధర్నాకు దిగవలసి వస్తుందని ఈ సందర్భంగా ఆమె హెచ్చరించారు.

అక్రమ నిల్వ ఇసుక స్వాధీనం

తహసిల్దార్ త్రివేణి

విశాలాంధ్ర-డుంబ్రిగుడ : అక్రమంగానిల్వ చేసిన ఇసుకను స్వాధీనం చేసుకుని తరలించడం జరిగిందని తహసీల్దార్ త్రివేణి తెలిపారు అరుకు పంచాయతీ కేంద్రానికి ఆ నుకుని ఉన్న జైపూర్ కూడలి సమీపంలోని ప్రభుత్వ భూమిలో అక్రమంగా ఇసుక నిల్వ చేపడుతున్నారని చెప్పారు. అక్రమ ఇసుక నిల్వ కేంద్రాన్ని స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. అక్రమంగా ఏడు యూనిట్ల ఇసుకను స్వాధీనం చేసుకుని ఐటీడీఏ పీఓ తిరుమణి శ్రీపూజ ఆదేశాల మేరకు గిరిజన సంక్షేమశాఖ భవన నిర్మాణానికి తరలించడం జరిగిందన్నారు. ప్రభుత్వ నిభందనలకు వ్యతిరేకంగా ఇసుక నిల్వలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. ఆరి రాము, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సామాజిక మాధ్యమాల్లో అసభ్యకర పోస్టులు పెడితే శిక్షలు తప్పదు

విశాఖపట్నం రేంజ్ డీఐజీ గోపీనాథ్‌జట్టి వెల్లడి

విశాలాంధ్ర-పాడేరు : సామాజిక మాధ్యమాల్లో అభ్యంతరకర, అసభ్య పోస్టుల పెడితే శిక్షలు తప్పవని విశాఖపట్నం రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. విశాఖపట్నం రేంజ్ పరిధిలో గల అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, విజయనగరం, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాల ఎస్పిలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్ష సమావేశంలో విశాఖపట్నం రేంజ్ పరిధిలో గల వివిధ జిల్లాల ఎస్పిలతో పాటు, డియస్పిలు కూడా పాల్గొనడం జరిగినది. ఈ సందర్భంగావిశాఖపట్నం రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి మాట్లాడుతూ సామాజిక మాధ్యమాల్లో అసత్య ప్రచారాలు చేస్తూ మహిళలను అగౌరవ పరుస్తూ పోస్టులు పెట్టిన ప్రతీ పోస్టును క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామని, పోస్టులు పెట్టిన వారిపై చర్యలు తప్పవని, కఠినంగా శిక్షించబడతారన్నారు. ఇటీవల ఇటువంటి పోస్టులు పెడుతున్న నేపథ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రతి జిల్లాలో నోడల్ ఆఫీసర్‌ను నియమించి అతని పర్యవేక్షణలో ప్రత్యేక బృందాల ద్వారా నూతన సాంకేతిక పరిజ్ఞానంతో నిరంతర పరిశీలన చేసి అభ్యంతకర పోస్టులు పెట్టిన వ్యక్తులను గుర్తించి, వారు పెట్టిన పోస్ట్ ఏ కేటగిరికి వస్తుంది? వారిపై ఎటువంటి చర్యలు చేపట్టాలి మొదలగు అంశాలపై రోజువారి నివేదిక ఇవ్వాల్సిందిగా అధికారులను ఆదేశాలు ఇవ్వడం జరిగిందన్నారు. ముఖ్యంగా తరచుగా అభ్యంతకర పోస్టులు పెట్టే వారిన వివరాలు సేకరించాలని, వారికి సహకరిస్తున్న వ్యక్తులను వ్యవస్థీకృత నేరము చేసినట్లుగా పరిగణించి, వారిపై వ్యవస్థీకృత నేరమునకు సంబందించిన సెక్షన్ల క్రింద కేసులు నమోదు చేయాల్సి ఉంటుందని స్పష్టమైన ఆదేశాలు ఇవ్వడం జరిగినదన్నారు. ఈ విధంగా సామాజిక మాధ్యమాల్లో అభ్యంతకర అసభ్యకర పోస్టులు పెడుతున్న వారియొక్క వివరముల డేటాబేసును ప్రతీ జిల్లాలో తప్పనిసరిగా నిర్వహించాలని, విశాఖపట్నం రేంజ్ పరిధిలో ఈ విధంగా సామాజిక మాధ్యమాల్లో అభ్యంతకర పోస్టులు పెట్టిన వ్యక్తుల పైన ఇప్పటికే 134 కేసులు నమోదు చేయగా 106 మందిని అరెస్ట్ చేయడమైనది 57 కేసులలో చార్జి షీట్‌లు దాఖలు చేయగా 25 కేసులు లో విచారణ ప్రారంభమైందన్నారు. డియస్పీలు వారి పరిధిలో గల పోలీస్ స్టేషన్‌లో నమోదైన సోషల్ మీడియా కేసులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని వారి పర్యవేక్షణలో త్వరితగతిన దర్యాప్తు పూర్తి చేయాలని అదే సాలు జారీ చేయడం జరిగిందన్నారు. విచారణలో ఉన్న కేసులలో త్వరితగతిన విచారణ జరిగేట్లు పర్యవేక్షించాల్సిందిగా జిల్లా ఎస్పిలకు ఆదేశాలు ఇవ్వడం జరిగిందన్నారు.సామాజిక మాధ్యమాల్లో అభ్యంతకర, అసభ్య పోస్టులు పెడుతూ, అనైతిక అసాంఘిక పనులు చేస్తున్న వ్యక్తులు చట్టం నుండి ఏవిధముగానూ తప్పించుకోలేరని గుర్తుంచుకోవాలని హెచ్చరించినారు. ఈ కార్యక్రమంలో ఎస్పీలు, డియస్పిలు పాల్గొన్నారు.

ముంపు మండలాల సమస్యలు సీఎం దృష్టికి తీసుకెళ్లిన శ్రీనివాస్‌రావు

విశాలాంధ్ర-ఎటపాక : ముంపు మండలాల సమస్యలని సీఎంచంద్ర బాబు దృష్టికి స్థానిక టీడీపీ నాయకులు తోటకూరి శ్రీనివాసరావు తీసుకెళ్లారు. శుక్రవారం అమరావతిలో సిఎంని కలిశారు. ఎటపాక మండలంలో అగ్నిమాపక కేంద్రం, జూనియర్ కాలేజి, ప్రభుత్వ ఆసుపత్రి, విద్యుత్ ఉప కేంద్రం, నందిగామ నుండి చలంపాలెం మీదుగా ఏడుగురాళ్ల పల్లి వరకు రోడ్డు నిర్మాణం చేపట్టాలని తెలిపారు. అంతే కాకుండా చింతూరు మండలంలో అన్న క్యాంటీన్ ఏర్పాటు చేయాలని సిఎంకి వివరించారు.

గిరిజన వైటిసిలో పనిచేస్తున్న సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి

గిరిజన సంఘాల నాయకులు

విశాలాంధ్ర-బెలగాం : గిరిజన వైటిసిలో గర్భిణీల కోసం పనిచేస్తున్న సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించి పెండింగ్ జీతాలు విడుదల చేయాలని పలు గిరిజన సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ కు ప్రభాకరరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ సాలూరు గుమ్మలక్ష్మిపురం వైటీసీలో గిరిజన గర్భిణీల కోసం ఏడు సంవత్సరాల నుండి పనిచేస్తున్నారనీ వారికి అరకొర జీతాలు ఇచ్చి ఇప్పటివరకు పని చేయించుకున్నారని ఎటువంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా మీరు ఇక నుండి గిరిజన గర్భిణీల కోసం సేవలు చేయవలసిన అవసరం లేదని తెలియజేసియున్నారని వారు మా గిరిజన గర్భిణీలు కోసం ఏడు సంవత్సరాల నుండి ఎటువంటి ప్రతిఫలం ఆశించకుండా జీతాలు ఎప్పుడు వేసినా మా గిరిజనులకు సేవ చేసుకుంటామంటూ ఇప్పటి వరకు వారు పని చేస్తున్నారు కానీ ఈ గిరిజన వైటీసీలో గర్భిణీల కోసం వారి ప్రాణాలు సైతం లెక్కచేయకుండా కరోనాతో పోరాటం చేసి గిరిజన గర్భిణీల కోసం సేవలు అందించినందుకు వారికి ఇదేనా ప్రతిఫలం అని గిరిజన సంఘాలుగా మేము ప్రతిఘటిస్తున్నామన్నారు. గత పిఓ డాక్టర్ లక్ష్మీషా గిరిజన గర్భిణీల కోసం గిరిజన సంఘాల అభిప్రాయాలు సలహాలు సూచనలు తీసుకొని ఆచరణలోనికి తెచ్చి ఒక గుర్తింపు వచ్చిందని నేషనల్ హెల్త్ మిషన్ పరిశీలన చేసి నేషనల్ అవార్డు కూడా ప్రకటించిందని అలాగే అంబేద్కర్ పిఓ కూడా పూర్తిగా పరిశీలన చేసి గిరిజన గర్భిణీలకు సేవలు అందించాలని నియమించడం జరిగిందని, 2018 నుండి 2025 వరకు ఇప్పటివరకు సేవలు కొనసాగిస్తున్నారని ఇప్పుడు అకస్మాత్తుగా వారు వారి కుటుంబాలు పిల్లలు రోడ్లున పడి అర్థం కాని పరిస్థితి ఏర్పడిందని గిరిజనుల సంస్థ ప్రాజెక్ట్ ఆఫీసర్ దృష్టి సారించి వారికి ఉద్యోగ భద్రత కల్పించి గిరిజన వైటిసి గర్భిణీ గృహ వసతిలో యథావిధంగా కొనసాగే విధంగా ఆలోచన చేయాలని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో ట్రైబల్ రైట్స్ ఫోరం (టిఆర్ఎఫ్)జిల్లా అధ్యక్షులు ఇంటికుప్పల రామకృష్ణారావు, గిరిజన అభ్యుదయ సంఘం జిల్లా అధ్యక్షులు ఆరిక చంద్రశేఖర్, గిరిజన విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు పల్ల సురేష్, గిరిజన సంక్షేమ శ్రామిక సంఘం నాయకులు దుక్క సీతారాం, ట్రైబల్ రైట్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు రొబ్బా లోవరాజు, గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్, కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ జెఎసి జిల్లా కన్వీనర్ బివి రమణ, సిపిఐ ఎంఎల్ (లిబరేషన్) నాయకులు పి.సంగం, గుమ్మలక్ష్మిపురం, సాలూరు గిరిజన గర్భిణీల వసతి గృహ సిబ్బంది పాల్గొన్నారు.

మక్కువ వయా సాలూరు రోడ్డు పనులు వెంటనే పూర్తి చేయాలి : సీపీఎం డిమాండ్

విశాలాంధ్ర-మక్కువ : మన్యం జిల్లా మక్కువ మండలం ఫేన్షనర్ల భవనంలో కామ్రేడ్ తాడంగి ప్రభాకర్ అధ్యక్షతన సిపిఎం పార్టీ మండల జనరల్ బాడీ సమావేశం జరిగింది ఈ సమావేశంలో సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి కొల్లి గంగు నాయుడు మాట్లాడుతూ మక్కువ మండలంలో అనేకమైన సమస్యలు ఉన్నాయని ఈ సమస్యల పరిష్కారం కోసం సిపిఎం పార్టీ పోరాడుతుందని అన్నారు ముఖ్యంగా మక్కువ మండలంలో గిరిజనులు పేదలు ఆధీనంలో ఉన్న పట్టా భూములను కొంతమంది పెత్తందారులు ఆక్రమించి మండలంలో పాత రికార్డు లేకుండా చేసి అనుభవిస్తున్నారని వాటన్నిటిపై సమగ్ర సర్వే చేసి భూములను గిరిజనులు పేదలకు తిరిగి అప్పజెప్పాలని డిమాండ్ చేశారు అలాగే అనేకమంది గిరిజనులు పేదలు అనేక సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్న భూములకు ఇప్పటికీ డీ పట్టాలు ఇవ్వలేదని అలాగే అటవీ హక్కుల చట్టం ప్రకారం పోడుపట్టాలు కూడా సక్రమంగా ఇవ్వలేదని వీటన్నిటిపై భవిష్యత్తులో సిపిఎం పార్టీ దశలవారి ఆందోళన చేస్తుందని అన్నారు అలాగే మక్కువ వయా భాగువలస సాలూరు రోడ్డు గత ఆరు సంవత్సరాల నుండి పూర్తిగా పాడుబడిపోయిందని కనీసం వాహనాలు ద్విచక్ర వాహనాలు కూడా తిరిగే పరిస్థితి లేదని వెంటనే పూర్తి చేయాలని అలాగే మన్యం జిల్లాలో ఉన్న గిరిజన ప్రాంత రోడ్లన్నీ పూర్తి చేస్తామని గత సంవత్సరం ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గారు దుగ్గేరు సిరివర రోడ్డును ప్రారంభించారని ఇంతవరకు అది పూర్తి కాలేదని వెంటనే రోడ్లన్నీ పూర్తి చేయాలని అలాగే సురాపాడు అడారి గడ్డలపై మినీ రిజర్వాయర్లు నిర్మించాలని వెంగళరావు సాగర్ ప్రాజెక్టు చివరి భూములకు నీరు సక్రమంగా అందించాలని ఈ సమస్యలన్నీ పరిష్కారం కోరుతూ భవిష్యత్తులో ఆందోళన చేస్తామని అన్నారు ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎన్ వై నాయుడు సిపిఎం పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

తేనెటీగల ప్రాసెసింగ్‌పై గిరిజనులకు శిక్షణా తరగతులు నిర్వహణ

విశాలాంధ్ర-చింతపల్లి : తేనెటీగల ప్రాసెసింగ్ పై నిర్వహించిన శిక్షణ తరగతులు గిరిజనులకు ఎంతో ఉపయోగకరమని హనీ మిషన్ నోడల్ అధికారి సుబ్రమణ్యం అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆత్మ నిర్భర్ భారత్ అనే కార్యక్రమం ద్వారా తేనె ప్రాసెసింగ్ యూనిట్ పై హనీ మిషన్ నోడల్ అధికారి సుబ్రమణ్యం ఆధ్వర్యంలో కప్పల బెన్నవరం గ్రామంలో ఫార్మర్స్ ప్రొడ్యూస్ ఆర్గనైజేషన్ వద్ద నిర్వహించిన పది రోజుల శిక్షణా తరగతులు శనివారంతో ముగిశాయి. ఈకార్యక్రమాన్ని ఉద్దేశించి సుబ్రమణ్యం మాట్లాడుతూ తేనెటీగల ప్రాసెసింగ్ పై నిర్వహించిన శిక్షణ తరగతులు ద్వారా తేనెటీగల పెంపకం, తేనె ఉత్పత్తి, మార్కెటింగ్ సదుపాయాలపై 20 మంది లబ్ధిదారులకు పది రోజులపాటు నిర్వహించిన శిక్షణ తరగతులు శనివారంతో దిగ్విజయంగా పూర్తి చేయడం జరిగిందన్నారు. మన్య ప్రాంతంలో ఇటువంటి శిక్షణ తరగతులు నిర్వహించడం ఈ ప్రాంతీయులకు ఎంతో ఉపయోగకరం అన్నారు. సహజ సిద్ధంగా లభించే తేనె సేకరణలో గిరిజనులు పాత పద్ధతులను ఉపయోగించడం ద్వారా తేనెటీగలు కనుమరుగు అయ్యే పరిస్థితి ఉందన్నారు. ఇటువంటి శిక్షణల ద్వారా తేనెటీగల సంరక్షణ పట్ల కూడా గిరిజనులకు అవగాహన ఏర్పడుతుందన్నారు. ఖాదీ విలేజ్ ఇండస్ట్రీస్ కమీషన్ (కెవిఐసి) ద్వారా ఉచితంగా అందిస్తున్న ఈ శిక్షణ తరగతులను మొదట విడత ప్రారంభించిన శిక్షణ తరగతులను లంబసింగి ఫార్మర్స్ ప్రొడ్యూస్ ఆర్గనైజేషన్ వద్ద, రెండవ విడత ప్రారంభించిన శిక్షణ తరగతులను నేడు కప్పల బెన్నవరం గ్రామంలో ముగింపు కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. లంబసింగి ఫార్మర్స్ ప్రొడ్యూస్ ఆర్గనైజేషన్ సహకారంతో ప్రోగ్రాం అధికారి ఎం కిరణ్ కుమార్ పర్యవేక్షణలో శిక్షకుడు ఎల్.ఎస్.రెడ్డి పర్యవేక్షణలో 20 మంది గిరిజనులకు పది రోజుల పాటు ఇచ్చిన శిక్షణ తరగతులు నిర్వహించి నేడు ముగింపు కార్యక్రమాన్ని పూర్తిచేయడం జరిగిందన్నారు. తేనెటీగల పెంపకంలోనూ, తేనె పరిశ్రమ నిర్వహణలో మెలకువలు నేర్పడంలోనూ కెవిఐసి ద్వారా అందించే ఈ ఉచిత శిక్షణా కార్యక్రమాన్ని రెండు బృందాలుగా ఒక్కొక్క బృందంలో 20మంది గిరిజనులు పది రోజులపాటు శిక్షణ పొందారన్నారు. ఈ శిక్షణాకాలంలో గిరిజనులు తేనెటీగల పెంపకం, తేనె సేకరణ, తేనె ప్రాసెసింగ్‌పై అనేక మెలకువలు నేర్చుకున్నారన్నారు. ఇటువంటి శిక్షణలు తేనెటీగల పెంపకానికి, వాటి సంరక్షణకు, తేనె సేకరణకు గిరిజనులకుఎంతగానో ఉపయోగపడు తుందన్నారు. 10 లక్షల రూపాయల ఈ ప్రాజెక్ట్‌లో ఖాదీ విలేజ్ ఇండస్ట్రీస్ ద్వారా అందించే ఈ శిక్షణ ఉచితమన్నారు.ఈ శిక్షణా కార్యక్రమంలో తేనే పెట్టెలు ఎలా పెంచాలి, తేనె ఎలా సేకరించాలి, దానిని ఏ విధంగా మార్కెటింగ్ చేసుకోవాలి అనే దానిపై 20 మంది చొప్పున రెండు గ్రూపులుగా విభజించి ఈ శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందన్నారు. తేనె పెట్టెను లైవ్ ద్వారా తీసుకువచ్చి ఎంపికైన సభ్యులకు ప్రాక్టికల్ గా శిక్షణ ఇవ్వడం ద్వారా పది రోజులపాటు అందించిన శిక్షణ కార్యక్రమంలో తేనెటీగల పెంపకంపై గిరిజనులు అనేక మెలకువలు నేర్చుకున్నారన్నారు. తేనెటీగల పెంపకం వలన రైతులకు ఆదాయం రావడంతో పాటు వారు పారిశ్రామికంగా ఎదిగేందుకు ఈ శిక్షణ ఎంతగానో దోహదపడుతుందన్నారు. పూత అభివృద్ధి చెందే దశలో తేనె దిగుబడి పెరిగి రైతులకు అదనపు ఆదాయం వచ్చే అవకాశం ఉందన్నారు. శిక్షణ అనంతరం ఒక్కొక్క సభ్యునికి సుమారు 60 నుంచి లక్ష రూపాయల విలువచేసే విధంగా ఒక్కొక్కరికి 10 తేనె పెట్టెలను అందించడం జరుగుతుందన్నారు. వాటి ద్వారా వారి ఆర్థిక అభివృద్ధికి తోడ్పాటును అందిస్తున్నామన్నారు. ఈ సదవకాశాన్ని రెండు గ్రూపులుగా ఉన్న సుమారు 40 మంది గిరిజనులు సద్వినియోగం చేసుకోబోతున్నారని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఈశిక్షణా కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు లంబసింగి ఫార్మర్ ప్రొడ్యూస్ ఆర్గనైజేషన్ వారు అందించిన సహకారం మరువలేనిదన్నారు. ఈ సందర్భంగా వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజర్లు ఎం కిరణ్ కుమార్, జి సత్యనారాయణ, అధిక సంఖ్యలో రైతులు, హనీ మిషన్ లబ్ధిదారులు పాల్గొన్నారు.

పిల్లల్లో ఆరోగ్య, ఎదుగుదల సమస్యలు సకాలంలో గుర్తించాలి

ఆర్.బి.ఎస్.కె పిఓ డాక్టర్ జగన్‌మోహన్

విశాలాంధ్ర-బెలగాం : చిన్నారుల్లో ఆరోగ్యపరమైన మరియు ఎదుగుదల సమస్యలను సకాలంలో గుర్తించి చికిత్స అందించాలని రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమ జిల్లా అధికారి డాక్టర్ టి. జగన్ మోహనరావు స్పష్టం చేశారు. మండలంలో గంగాపురం, కోరి, ఎంఆర్ నగరం గ్రామాల్లో శనివారం సందర్శించారు. వైద్య సిబందితో కలిసి అంగన్వాడీ కేంద్రాలను పరిశీలించారు. ఆర్.బి.ఎస్.కెలో బాగంగా ప్రస్తుతం కొనసాగుతున్న పిల్లల హెల్త్ స్క్రీనింగ్ పై వైద్య సిబ్బందిని ఆరా తీసి పిల్లల్లో ఆరోగ్యపరమైన సమస్యలను ఖచ్చితంగా గుర్తించాలన్నారు. ఆన్లైన్ నమోదు తీరు పరిశీలించారు. పిల్లల ఎదుగుదల వివరాల రికార్డులు అంగన్వాడీ కేంద్రంలో పరిశీలించి, పిల్లల బరువు, ఎత్తు నివేదికలు ప్రతీ నెలా నమోదౌతున్న తీరు తనిఖీ చేశారు. అక్కడ పరికరాలతో పిల్లల బరువు, ఎత్తు గుర్తించి రికార్డులోని గణాంకాలతో గమనించారు. నివేదికలు ఖచ్చితంగా గుర్తించాలని, పోషకాహార లోపం గుర్తించిన పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. పిల్లల తల్లిదండ్రులను సమావేశపరిచి ఎప్పటికప్పుడు ఆరోగ్య జాగ్రత్తలపై అవగాహన కల్పించాలన్నారు. గ్రామాల్లో నిర్ధారణ పరీక్షలు, మందుల లభ్యతపై వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. గంగాపురంలో హెల్త్ వెల్నెస్ కేంద్రాన్ని తనిఖీ చేశారు. వైద్య, అంగన్వాడీ సిబ్బంది సమన్వయంతో పని చేస్తూ

చిన్నారుల ఆరోగ్యాన్ని పర్యవేక్షణ చేయాలని, 4డిలు అయిన ఎదుగుదలలో ఆలస్యం, వైకల్యాలు, వ్యాధులు, పుట్టుకతో సంక్రమించే లోపాలు గుర్తిస్తే జిల్లా కేంద్రంలో ఉండే బాలల సత్వర చికిత్సా కేంద్రంలో (డిఈఐసి) చేర్చాలని, ఇందుకు ఆర్.బి.ఎస్.కె వాహనాన్ని సద్వినియోగం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డెమో సన్యాసిరావు, వైద్య సిబ్బంది భారతి, దుర్గమ్మ, దమయంతి, అంగన్వాడీ సిబ్బంది శ్రీదేవి, రవణమ్మ, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

దేవస్థాన భూముల సమస్యను అసెంబ్లీలో గళమెత్తిన ఎమ్మెల్యే : రైతులు హర్షం

విశాలాంధ్ర-ఎటపాక : పురుషోత్తపట్నం దేవస్థానం భూములు సమస్య పరిష్కరించాలని రంప చోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషా దేవి శనివారం అసెంబ్లీలో మాట్లాడారు. అసెంబ్లీ దృష్టికి భూసమస్య తీసుకెళ్లినందుకు పురుషోత్తపట్నం రైతులు ఎమ్మెల్యేకి హర్షం తెలిపారు. శనివారం పురుషోత్తపట్నంలో జరిగిన విలేకర్ల సమావేశంలో రైతులూ మాట్లాడారు. గత 80 ఏళ్లుగా రైతులు సాగుచేసుకుంటున్న భూములు భద్రాచలం దేవస్థానం వారివని రైతులను దేవస్థానం అధికారులు ఎన్నో అడ్డకులు పెడుతున్న ఎదుర్కొంటూ వస్తున్నామని, మునుపెన్నడు చేయని సాహసం మన ఎమ్మెల్యే శిరీష దేవి రైతులు పక్షాన నిలబడి రైతు సమస్యలని ఇటీవల జరుగుతున్న ఏపీలో జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా ఎమ్మెల్యే రైతులు పక్షాన గళం విప్పారు. ఏళ్ళ తరబడి దేవస్థానం అధికారులతో రైతులూ భూవివాదం లో సమస్యలు పడుతున్నారని, వారు వ్యవసాయ బోర్లు వేసుకున్నామన్న, ఇండ్లు కట్టుకుందామని ఇళ్లు నిర్మిస్తే అధికారులు వారి సిబ్బందితో వచ్చి రైతులు పై దాడులు చేస్తున్నారన్నారు. భూ వివాద సమస్యను పరిష్కరించాలని అసెంబ్లీలో ఎమ్మెల్యే కోరారు. రైతులు ఎమ్మెల్యే శిరీష దేవి మతం భాస్కర్ దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించి పురుషోత్తమ పట్నం రైతులు తరుపున మాట్లాడారు. ఎమ్మెల్యేకి రైతులు హర్షం తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ గ్రామ కమిటి అధ్యక్షులు చేకూరి రమేష్, తెలుగు యువత ఉపాధ్యక్షులు కో కన్వీనర్ విజ్జగిరి రవితేజ, బూత్ కన్వీనర్ పుట్టి వెంకట వాసు దేవరావు, అర్కిమల్ల చంద్రరావు, రాయపాటి రాధ కృష్ణా, చుంచు వెంకటేశ్వరావు, నూతల పాటి శివరామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కామ్రేడ్ తోట సుధాకర ప్రసాద్ వర్ధంతి

విశాలాంధ్ర-బెలగాం : కామ్రేడ్ తోట సుధాకర ప్రసాద్(24వ) వర్ధంతి సందర్భంగా శనివారం జిల్లా కలక్టరు కార్యాలయపు సమావేశ భవనంలో ఆంధ్రప్రదేశ్ రెవిన్యూ సేవల సంఘం పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షులు గొట్టాపు శ్రీరామమూర్తి అధ్యక్షతన రెవెన్యూ ఉద్యోగులు ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధులుగా జిల్లా రెవిన్యూ అధికారి కె.హేమలత, ప్రత్యేక ఉప కలక్టర్లు పి.ధర్మచంద్రా రెడ్డి, ఎస్. దిలీప్ చక్రవర్తి విచ్చేసి ఉద్యోగుల కోసమే జీవించి, ఉద్యోగుల కోసమే తన చివరి శ్వాస విడిచిన పోరాట యోధుడు, విప్లవ వీరుడు కామ్రేడ్ తోట సుధాకర్ ప్రసాద్ అని సంఘానికి చేసిన సేవలను కొనియాడారు. తదుపరి ఎపిఆర్ఎస్ఎ రాష్ట్ర కార్యవర్గంచే ప్రచురించబడిన వారి జీవిత చరిత్ర పుస్తకాలను ముఖ్య అతిధులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ కార్యాలయపు పరిపాలనాధికారి ఎన్.చిన్నారావు, కలక్టరేట్ యూనిట్ అధ్యక్షులు కె.చంద్రమౌళి, సంఘ కార్యవర్గ సభ్యులు, రెవిన్యూ ఉద్యోగులు పాల్గొన్నారు.

వేద మంత్రాల నడుమ మోదకొండమ్మ ఆలయ సింహద్వారం ఏర్పాటు

- 30 ఆలయాలకు పూజా సామాగ్రి పంపిణీ
- ధార్మిక సంస్థల సేవా ప్రతినిధి డివిడి ప్రసాద్

విశాలాంధ్ర-కొయ్యూరు : మండలంలోని పెదమాకవరం గ్రామ సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ మోదకొండమ్మ తల్లి ఆలయంలో గర్భగుడి సింహద్వారం అమిర్చే కార్యక్రమాన్ని స్థిరవారం శాస్త్రోక్తంగా ఘనంగా నిర్వహించారు. ధార్మిక సంస్థల సేవా ప్రతినిధి డివిడి ప్రసాద్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో కృష్ణదేవిపేటకు చెందిన శ్రీ కామాక్షి వీరబ్రహ్మేంద్ర వడ్రంగి వనివాళ్ల సంఘం తరపున సామకూర్చిన సింహద్వారాన్ని వేద మంత్రాల నడుమ డివిడి ప్రసాద్ గౌరీ దంపతులతో పాటు పలువురు భవాని మాల ధారణ భక్తులు, వడ్రంగుల సంఘ ప్రతినిధులు పూజా కార్యక్రమాలు నిర్వహించి శాస్త్రోక్తంగా గర్భగుడి కి అమర్చారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో సుమారు 30 మంది గిరిజన ప్రాంత అర్చకులకు ధూప దీప నైవేద్యాలకు వీలుగా పూజా సామాగ్రిని అందజేశారు. దేవి శరన్నవరాత్రి మహోత్సవాల సందర్భంగా పలువురు వృద్ధులకు మహిళలకు ప్రసాద్, గౌరీ దంపతుల ఆధ్వర్యంలో చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సంపర శివకుమార్, ధన్యంరాజు పద్మరాజు, పాడేరు మార్కెట్ కమిటీ చైర్పర్సన్ మచ్చలు మంగతల్లి, మోదకొండమ్మ తల్లి ఆలయ నిర్మాణ స్థలదాత ర్యాలి.ప్రసాద్, వలసంపేట డీలర్ వెంకట రమణ, మాజీ సర్పంచ్ లోత అప్పలకొండ, కృష్ణంరాజు తదితర పలువురు పాల్గొన్నారు.

కొత్తగా వినాయకుని విగ్రహ ప్రతిష్ట

విశాలాంధ్ర-వి.ఆర్.పురం.: మండల కేంద్రంలోని వడ్డీగూడెం గ్రామ పంచాయితీలోని వడ్డీగూడెం గ్రామంలో పెట్టావారివీధిలో నూతనంగా నిర్మించిన గుడిలో శనివారం వినాయకుని విగ్రహాన్ని అంగరంగా వైభవంగా భక్తిశ్రద్ధలతో వేదమంత్రాలతో ప్రతిష్ట నిర్వహించారు. ముందుగా భక్తులు వినాయకుని విగ్రహాన్ని దేవుని భజన పాటలతో గ్రామంలో ఊరేగింపు చేశారు. అనంతరం ఆలయం వద్ద శ్రీరామగిరి రామాలయం ప్రధానార్చకులు సౌమిత్రి పురుషోత్తమాచార్యులు వేద మంత్రాలతో, విగ్రహ దాత తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు, టీడీపీ మండల అధ్యక్షుడు ఆచంట శ్రీనివాసరావు దంపతుల చేతులమీదుగా విగ్రహ ప్రతిష్టను నిర్వహించారు. రంపచోడవరం ఎమ్మెల్యేగా మిరియాల శిరీష దేవి గెలిస్తే విగ్రహాన్ని గుడికి అందిస్తానని విగ్రహ ప్రతిష్ట ఖర్చులు తాను భరిస్తానని ఆచంట శ్రీనివాసరావు పెట్టవారివీది గ్రామస్తులకు హామీ ఇవ్వగా ఆ హామీని నేడు నెరవేర్చుకున్నారు. విగ్రహ ప్రతిష్ట అనంతరం భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఆలయ ప్రాంగణం వద్ద అలయ కమిటీ వారి ఆధ్వర్యంలో భారీ అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ వాళ్ల రంగారెడ్డి, బొర్రా నరేష్, బురక కన్నారావు, ముత్యాల సిద్దు, బొర్రా ఆది, పెందుర్తి సుదర్శన్‌రావు, బీరక ప్రకాశరావు, ముత్యాల చంద్రశేఖర్, వైస్ ఎంపీపీ వడ్డానపు బాగ్యలక్ష్మి, మోదుగుల వెంకన్నబాబు, బాగుల అంజనరావు, ముత్యాల రాంబాబు, స్థానిక గ్రామ పెద్దలు, భక్తులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

శక్తి టీంల అవగాహన

విశాలాంధ్ర-బెలగాం : పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ ఎస్.వి.మాధవ్ రెడ్డి ఉత్తర్వుల ప్రకారం పార్వతీపురం సబ్ డివిజన్ ఎఎస్పీ అంకిత సురాన ఆదేశాల మేరకు పార్వతీపురం శక్తి టీమ్స్, పోలీస్ అధికారులు, సిబ్బంది శనివారం పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల, బెలగాం చర్చివీధిలో గల వేదాంత జూనియర్ కళాశాలలను సందర్శించి అందులో గల విద్యార్థులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్, పోక్సో చట్టాలు, సైబర్ నేరాలు, మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలు, ఈగిల్ మరియు బాల్య వివాహాలు, డయల్ 112 సేవలపై అవగాహన కల్పించారు. జిల్లాలో భద్రతా చర్యలను మరింత బలోపేతం చేయడానికి శక్తి టీం ఆధునిక సాంకేతికతను వినియోగిస్తోందని తెలియచేస్తూ ప్రతిఒక్క విద్యార్థిని తన యొక్క మొబైల్ ఫోన్లో శక్తి యాప్ రిజిస్ట్రేషన్ చేసుకుని అందులో ఉండే 11 ఫ్యూచర్స్‌పై అవగాహన చేసుకుని ఆపద సమయంలో శక్తి యాప్ ఎలా వినియోగించుకోవాలో వారికి అవగాహన కల్పించారు. ఈ అవగాహన కార్యక్రమంలో పార్వతీపురం శక్తి టీం ఇంచార్జ్ మరియు ఎఎస్ఐ లెంక శ్రీనివాస రావు(1154), మహిళా కానిస్టేబుల్ ఎన్. పద్మ (492), శక్తి టీం 1 పార్వతీపురం సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయితీ పురోగతి అభివృద్ధి శిక్షణపై అవగాహన

విశాలాంధ్ర-బలిజిపేట : మండలంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శనివారం పంచాయితీ పురోగతి అభివృద్ధి శిక్షణపై అవగాహన కార్యక్రమము ఎంపీపీ గుడివాడ నాగమణి అధ్యక్షతన శనివారము 9 అంశములైన పిఏఐ థీమ్స్ పేదరికం లేని మెరుగైన జీవనోపాధి కలిగిన గ్రామంగా ఆరోగ్యకరమైన, బాలిక స్నేహపూర్వకమైన గ్రామముగాను నీరు సమృద్ధి కలిగిన గ్రామముగా పచ్చదనము పరిశుభ్రత కలిగిన గ్రామముగా మౌలిక సదుపాయములో కలిగిన గ్రామముగా సామాజిక న్యాయము భద్రత కలిగిన గ్రామం గాను సుపరిపాలన కలిగిన గ్రామముగాను మహిళ స్నేహపూర్వకము క్రమముగాను తీర్చిదిద్దాలని గ్రామపంచాయతీ సర్పంచులకు ఎంపీటీసీలుకు అవగాహన కల్పించారు ఈ కార్యక్రమమునకు ముఖ్య అతిథిగా ఎంపీడీవో శ్రీవాణి జడ్పిటిసి సభ్యులు అలజంగి రవికుమార్ మరియు గ్రామ పంచాయతీ కార్యదర్శులు సర్పంచులు ఎంపీటీసీ సభ్యులు శిక్షణ తరగతులకు మండల అధికారులు హాజరయ్యారు.

శిశువులు, చిన్నారుల విషయంలో తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి

చిన్నపిల్లల వైద్యనిపుణురాలు ప్రభావతి

విశాలాంధ్ర-చింతపల్లి : శిశువులు, చిన్నారుల విషయంలో తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని చిన్నపిల్లల వైద్య నిపుణురాలు డాక్టర్ ప్రభావతి అన్నారు. శనివారం ఆమె మాట్లాడుతూ శిశువుల నుంచి మూడేళ్లలోపు చిన్నారుల వరకు వారు ఆడుకునే సమయంలో తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ వయసులో శిశువులు, చిన్నారులు తమ చేతికి అందిన ఏవస్తువునైనా నోటిలో గాని, చెవిలో గాని, ముక్కులో గాని పెట్టుకునే అవకాశం ఉందన్నారు. దీనివలన ఒక్కొక్కసారి ప్రాణానికి కూడా ముప్పు వాటిల్లే ప్రమాదం లేకపోలేదన్నారు. గడచిన మూడు రోజుల క్రితం ఇదే విధంగా తన వద్దకు ముక్కు రంధ్రంలో జొన్నపిక్క పెట్టుకున్న ఒక చిన్నారిని తీసుకురావడం జరిగిందన్నారు. ఆ సమస్యను చాకచక్యంగా పరిష్కరించడం జరిగిందన్నారు. ఇటువంటి సమస్యలు తలెత్తకుండా తల్లిదండ్రులు శిశువులు, చిన్నారుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇటువంటి సమస్యలు తలెత్తినప్పుడు సొంత ప్రయోగాలు చేయకుండా దగ్గర్లోని ఆసుపత్రులకు తీసుకువెళ్లి సమస్యను వైద్యుల పర్యవేక్షణలో పరిష్కరించుకునేలా తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు అవగాహన కలిగి ఉండాలని ఈ సందర్భంగా ఆమె తెలిపారు.

జీఎస్టీపై పాత, కొత్త రేట్ల పట్టిక దుకాణదారులు ఏర్పాటుచేయాలి

- జీఎస్టీ కొత్త రేట్లు.. ప్రజలకు కేంద్రం కీలక సూచన
- ఎంపీడీఓ ఇమ్మానియేల్

విశాలాంధ్ర-వి.ఆర్.పురం : అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ , ఐటీడీఏ పీవో చింతూరు శుభం నొక్వాల్ వారి ఆదేశాల మేరకు మండలంలొ వస్తు సేవల పన్ను జీఎస్టీ తగ్గింపు సెప్టెంబర్ 22వ తేదీ మొదలై నందున దుకాణదారులు జీఎస్టీపై పాత కొత్త రేట్లు పట్టిక ఏర్పాటు చేయాలని ఎంపీడీవో పి ఇమ్మానియేల్ శనివారం దుకాణదారుల వద్దకు వెళ్లి తెలిపారు. కొత్తగా జీఎస్టీ రేట్లు అమలులోకి వచ్చిన తర్వాత మొత్తం 375 రకాల వస్తువులు ఉత్పత్తుల ధరలు తగ్గినవని డైరీ ఉత్పత్తులు ఎలక్ట్రానిక్ వస్తువుల ధరలు భారీగా తగ్గినవి ఇప్పటికే ఆ కంపెనీల ధరలు తగ్గింపు ప్రకటనలు చేశాయన్నారు. వాటితోపాటు ఆహార పదార్థాలు శీతల పానీయాలు వస్త్రములు అన్ని విభాగాల లొ రేట్లలో మార్పులు చోటు చేసుకున్నాయి అని ఆయన అన్నారు మండల ప్రత్యేక అధికారి మురళి వారికి చెప్పడం జరిగిందనీ తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి వాళ్ల రంగారెడ్డి , శ్రీనివాస్, రాంబాబు, నరేష్, అంజనరావు, ప్రజాప్రతినిధులు, మండల కూటమి నాయకులు, పంచాయతీ కార్యదర్శులు గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

అన్యాయానికి గురైన ప్రతి కార్యకర్తకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుంది

విశాలాంధ్ర-పాడేరు : డిజిటల్ బుక్" ఆవిష్కరించిన పాడేరు శాసనసభ్యులు అల్లూరి జిల్లా అధ్యక్షులు మత్స్యరాస విశ్వేశ్వరరాజు, ఎంపీ డాక్టర్ గుమ్మ తనూజ రాణి.. అరకు శాసనసభ్యులు రేగం మత్యలింగం, అరకు పార్లిమెంట్ పరిశీలకులు బొడ్డేటి ప్రసాద్, మాజీ శాసన సభ్యులు చెట్టి పాల్గుణ, జిల్లా ముఖ్య నాయకులు. ఈ కార్యక్రమానికి ఉద్దేశించి శాసనసభ్యులు విశ్వేశ్వరరాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఈ రాష్ట్రంలో అరాచక పాలనాన్ని రెడ్ బుక్ రాజ్యాంగం నడిపిస్తూ వైయస్సార్ కాంగ్రెస్ నాయకులకు పార్టీ కార్యకర్తలకు తప్పుడు కేసులు పెట్టి చాలా అన్యాయానికి గురి చేస్తున్నారు, అన్యాయానికి గురైన ప్రతీ కార్యకర్తకు అండగా ఉండాలని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జగన్మోహన్ రెడ్డి ఈనెల 24 తేదీన కేంద్ర కార్యాలయంలో రాష్ట్రస్థాయి నాయకుల సమక్షంలో డిజిటల్ బుక్ యాప్ ప్రారంభించారు. శనివారం జిల్లా ముఖ్య నాయకులతో కలిసి పాడేరు జిల్లా క్యాంప్ కార్యాలయంలో డిజిటల్ బుక్ యాప్ పోస్టర్ ఆవిష్కరణ చెయ్యడం జరిగింది. కావున చంద్రబాబు నాయుడు మరియు కూటమి నాయకులు, వైసీపీ నాయకులకు కానీ కార్యకర్తలకు కానీ ఎటువంటి భయ భ్రాంతులు గురి చేసి తప్పుడు కేసులు పెట్టిన ధైర్యంగా ఈ యాప్ ద్వారా సమాచారం తెలియ పరచండి రేపు మన పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే తప్పు చేసినవారికి సప్త సముద్రాలు దాటి వెళ్ళినా వారికి తీసుకొచ్చి చట్టం ముందు నిలబెట్టే కార్యక్రమం జగన్మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం ప్రతి కార్యకర్తకు అండగా నిలవడానికి శ్రీకారం చుట్టారని అన్నారు. ఈ కార్యక్రమంలో పాడేరు అరకు నియోజక వర్గాల మండల పార్టీ అధ్యక్షులు, ఎంపీపీలు, జడ్పీటీసీలు, రాష్ట్ర, జిల్లా అనుబంధ విభాగాల నాయకులు, సర్పంచులు ఎంపీటీసీలు సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల వాడకం సమాజానికి చేటు

ప్రత్యేక అవగాహన సదస్సులో ఈగల్ బృందం

విశాలాంధ్ర-చింతపల్లి : మాదకద్రవ్యాల వాడకం సమాజానికి చేటు కలిగిస్తుందని ఈగల్ బృందం నిర్వహించిన అవగాహన సదస్సులో వెల్లడించింది. మాదకద్రవ్యాల (డ్రగ్స్) వినియోగం నివారణపై ప్రజల్లో అవగాహన పెంచే లక్ష్యంతో ఈగల్ బృందం చింతపల్లిలోని ఎస్ ఆర్ సీ రహదారుల గుత్తేదారులు మరియు కార్మికులకు, పనిచేస్తున్న కూలీలు, సిబ్బందికి శనివారం ప్రత్యేక అవగాహన శిబిరం నిర్వహించింది. ఈ సందర్భంగా మాదకద్రవ్యాల వాడకం సమాజానికి చేటు కలిగించడమే గాక, కుటుంబాలకు, ముఖ్యంగా యువత భవిష్యత్తుకు తీవ్రమైన ముప్పుగా మారుతోందన్నారు. మాదకద్రవ్యాల (డ్రగ్స్) వినియోగం వల్ల కలిగే ఆరోగ్య సమస్యలు, మానసిక ప్రభావాలు, కుటుంబ విభేదాల వంటి దుష్పరిణామాలను ఈ సందర్భంగా వివరించారు. అదేవిధంగా గంజాయి పండించడం, తరలించడం, రవాణా చేయడం, వినియోగించడం వంటి చట్ట విరుద్ధ కార్యకలాపాల్లో పాలుపంచుకుంటే కఠినమైన శిక్షలు ఎదురవుతాయనీ, ప్రజలు మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాల (డ్రగ్స్) సంబంధిత అనుమానాస్పద సమాచారం గమనించినప్పుడు తక్షణమే "ఈగల్ టోల్ ఫ్రీ నంబర్ 1972 " కు తెలియజేయాలని ఈ సందర్భంగా ఆ బృందం సభ్యులు తెలిపారు.

కనకదుర్గమ్మ తల్లి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి

విశాలాంధ్ర-చింతపల్లి : కనకదుర్గమ్మ తల్లి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని స్థానిక జడ్పిటిసి సభ్యుడు పోతురాజు బాలయ్య అన్నారు. దసరా నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని మండల కేంద్రంలోని రంగా సెంటర్ వద్ద కొలువు తీర్చిన కనకదుర్గమ్మ తల్లిని ఆయన శనివారం సతీసమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా కనకదుర్గమ్మకు ఆయన సతీమణి, మాజీ ఎంపీటీసీ సభ్యురాలు దేవుడమ్మతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దసరా నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని కొలువైన కనకదుర్గమ్మ అమ్మవారిని సతీసమేతంగా దర్శించుకోవడం సంతోషంగా ఉందన్నారు. కనకదుర్గమ్మ అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ప్రత్యేక పూజలు నిర్వనిర్వహించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ వార్డు సభ్యుడు నాయుడు పాల్గొన్నారు.